మారిపోయిన పిల్లాడు

‘ఇదుగోనమ్మా నీపిల్లాడు’ అని, నర్సు అందిచ్చినప్పుడే అన్నపూర్ణకి అనుమానం తట్టింది. ‘మారిపోలేదుగదా! ఆస్పత్రిలో అలాటి ప్రమాదం జరగటానికి అవకాశం చాలా ఉంది. ఒకళ్ళూ ఇద్దరూనా, వందలకొద్ది శిశువులాయిరి! నీళ్ళుపోసి తీసుకొచ్చి తల్లులకు అందివ్వటంలో ఒకళ్ళ కొకళ్ళు తారుమారై పోవచ్చు.’

అన్నపూర్ణకి ఇది ఐదోపురుడు మొదటిరెండు పురుళ్ళు పుట్టింట పోసుకుంది. మూడో పురుటికి తల్లిని సాయం రప్పించుకుంది. నాలుగోమాటుకి తల్లిపోవటం, మేనత్తను బ్రతిమాలటం జరిగింది. ఈమాటు ఎవర్ని బ్రతిమాలినా రాక, ఆమె ఆస్పత్రిలో పోసుకోవలసొచ్చింది. ఆస్పత్రిఅంటే ఆవిడకి ఎందుచేతనో ‘మొదట్నుంచీ ఇష్టంలేదు’ లేనట్టుగానే, పిల్లాడు మారిపోయాడన్న అనుమానం తగిలింది.

‘అనుమానమేమిటీ? నిజంగానే మారిపోయాడు! నా పిల్లలంతా మామిడిపండులా పచ్చగా ఉంటారు. ఏదీ ఆఛాయ వీడికి?’ అనుకుందామె పురిటి మంచంమీదే కూర్చున్న మూడేళ్ల ఎడపిల్లవాణ్ణీ ఆ మూడురోజుల పసిపిల్లాణ్నీ పోల్చి చూసిందోమాటు. ఆవిడ అనుమానం ధృఢపడింది. తన పిల్లలముక్కులన్నీ కోసుదేరి ఉంటాయి. ఆ తండ్రి ముక్కులే అవి. ‘ఈ ముక్కుతీరే వేరు, ఈ మొహమే వేరు!’

మరో పిల్లవాణ్ణి స్నాన్నమాడించి తీసుకుబోతూ నర్సు కనపడింది. అన్నపూర్ణ ఆమె నాపి, ‘ఏమమ్మా, మా పిల్లాడు మారిపోలేదుగద!’ అని అడుగుదామనుకుంది. అనుకోడమేగాని అడగలేదు. కొందరు కొన్ని పనులు చేద్దామనుకోడమేగాని చెయ్యలేరు. అలాంటిదే అన్నపూర్ణానూ. అడిగితే ఆ నర్సు ఏమనుకుంటుందో? ‘నీకేమైనా మతిగాని పోయిందా? మేం అంత వొళ్ళు తెలవకుండా మసులుతున్నామా?’ అని ఝూడించి

వదిలి పెడుతుంది. తక్కిన బాలింతలంతా పకపకా నవ్వుతారు తన్ను చూసి! ఆమెకు నోరు పెగిలిందికాదు.

తనకు మల్లేనే అవతల ఆ తల్లి ఎవరోగాని ఆమెకుకూడా ఈ అనుమానం తగలవలసిందేగా? ఆవిడ ధైర్యంచేసి అడిగెయ్యకూడదూ పోనీ! అప్పుడు, ‘ఇదుగో వీడేమో చూసుకోండి’ అని చెప్పి ఇచ్చేసి తన పిల్లణ్ణి తెచ్చుకోవచ్చు. అలా జరిగితే ఎంత బాగుండిపోను! ‘నా వెర్రిగాని అలా ఎందుకు జరుగుతుంది? ఆ తల్లికికూడా అనుమానం తగిలినా, ఆమె గప్‌చిప్‌గా ఊరుకుంటుందిగాని బయటపెట్టదు! ఏమంటే ఈ నల్లటివాడికి బదులు దబ్బపండులాంటి పిల్లవాడు దొరుకుతే ఏ తల్లి వద్దంటుంది?’

పాపం ఆమె ఆ చంటివానికేసి ఓమాటు ఎడవానికేసి ఓమాటూ చూస్తూ నీళ్లు నమిలి బాధపడింది. సాయంత్రం నాలుగు కొట్టడంతోనే చూచిపోడానికని వచ్చేవాళ్లకోసం ఆస్పత్రి తలుపులు బారుపెట్టారు. అందరితోబాటు రఘుపతిగారుకూడా వచ్చి భార్యని పలకరించారు. ఆమె అతనితో తన అనుమానాన్ని చెప్పింది. ఆయన నవ్వేశాడు. ‘నీకు ఆస్పత్రి అంటే ఇష్టంలేకపోవటమే. ఈ అనుమానానికంతకీ కారణం’ అనేశాడు. అన్నపూర్ణకి ఆస్పత్రి అంటే ఎంత అయిష్టమో, రఘుపతికి అంత ఇష్టం. అక్కడ అంతా ఒక ‘సిస్టం’ ప్రకారం జరుగుతుందనీ, అందరూ ‘కరక్టు’గా ఉంటారనీ, ఆయన నమ్మకం. అందుచేత అన్నపూర్ణ తన అనుమానానికి హేతువులు చూపుతోన్నా ఆయన కళ్ళు చూశాయికాదు. చెవులు విన్నాయి కాదు. ఇంగ్లీషులో ‘ఫూలిష్, నాన్‌సెన్సు!’ అని నవ్వేశాడు.

అన్నపూర్ణని ఆస్పత్రినుంచి ఐదోరోజున వెళ్ళిపోవచ్చునన్నారు. వెళ్ళటం అంటే ఆమెకు చెఱవిముక్తిలాగే తోచింది. కాని గేటువదలి తాను కూర్చున్న బండి ఆస్పత్రికి దూరమౌతూన్నకొద్దీ సొంత బిడ్డణ్ణి వదలేసి పోతూన్నట్లూ, వాడి స్థానే ఎవణ్నో తెచ్చుకుంటూన్నట్లూ అనిపించింది.

బారసాల జరిగింది. నామకరణ సమయంలో ‘ఎవరిపేరు?’ అన్న మీమాంస వచ్చినప్పుడు ‘ఎవరో కన్న అని పెట్టండి! ఏ పేరైతేం?’ అందామె. రఘుపతే నిర్ధారణచేసి, బియ్యంమీద ‘సూర్యప్రకాశం’ అని రాశాడు. “ఈ నల్ల నేరేడు పండుకి సూర్యప్రకాశ మనటమేమిటి?” అని నవ్వుకుంది అన్నపూర్ణ.

వాడు నల్లనేరేడుపండేనా, ఆమె వడిలో ఉన్నప్పుడల్లా ఆమెకు పాలు చేపొస్తూనే ఉండేవి. ఆమెకేం అనుమానమున్నా, ఆమె పాలివ్వటం మానాలేదు; పెంచకపోనూలేదు. పుట్టినరోజులూ చేసింది; భోగిపళ్ళూ పోసింది. అల్లరచేసి ప్రాణం విసిగించినప్పుడు కొట్టనూ కొట్టింది. కాని చిత్రమేమిటంటే, కొట్టిన కొద్దీ వాడామె డొక్కలోచేరి ఏడ్చేవాడు కాని దూరంగా పోయేవాడు కాదు. వాడు ఏడుస్తోంటే ఆమెకు జాలి వేసేది; ఎక్కువగా జాలివేసేదికూడాను! ఆ జాలికి కారణం ఆ అనుమానమే. సొంత పిల్లవాణ్ణి కొట్టినా అంత తప్పులేదు. నర్సు పొరపాటువల్ల సొంతతల్లిని పోగొట్టుకొని తనవద్దచేరిన నిర్భాగ్యుడేఐతే, వాణ్ణి తను కొట్ట వచ్చా? క్రమంగా ఆమెకు ఈ రకం సానుభూతి ఎక్కువై, 'వీడికి నావల్ల ఎట్టి అపచారం జరగకూడదు.' అనే నిశ్చయానికి ఆమె వచ్చింది. తన పిల్లవాడు ఏ తల్లివద్దనున్నాడో? వాణ్ణి ఆమె ఎలా పెంచుతోందో, కొడుతోందో, ఏమిటో?...ఇలాంటి ఊహవచ్చి, 'ఏమైనా వీణ్ణి నేను న్యాయంగా పెంచాలి!' అనుకుంది, తల్లికన్నా ఎక్కువగా పెంచింది!

సూర్యప్రకాశం 'అన్న'లకన్నా ఛాయ తక్కువే కాని ఎక్కువ బుద్ధిమంతుడన్న పేరు తెచ్చుకున్నాడు. ఆవిడ అన్నమాటే అది' ఇక్కడ సరుకుతీసి అక్కడ పెట్టమంటే ఆ తక్కిన నలుగురూ పెట్టేవారు కాదుట. వాడలాకాదు. అమ్మకూడా వుండి పనివేళ అదీ ఇదీ అందిస్తూ ఆడపిల్ల ఆసరాలేదన్న లోపం కనిపించకుండా చేసేవాడు. ఆవిడ ఏంచేసినా, మొగుడూ ఆయన ముక్కు తీరేవచ్చిన ఆ నలుగురు బిడ్డలూ వంకలెంచుతూ గాని తినేవారుగారు. ముక్కు కోణాలూ కాస్త పెద్దవే ఐనా, శరీర ఛాయ కొంచెం నలుపే ఐనా, ప్రకాశిగాడు మట్టుకు అమ్మ చేసినదల్లా మెచ్చుకుని తింటూండేవాడు. వాడు, 'అమ్మా, బాగుందే మిఠాయి!' అంటే, ఆవిడకి మరీకాస్త పెట్టబుద్ధేసేది.

ఒకనాడు అన్నపూర్ణకి మొగుడితో పేచీ వచ్చింది. రఘుపతికి ముక్కుకొనవే ఉండేది కోపం. పిల్లలతల్లి అన్న ఆలోచన లేకుండా ఆఘాత్తడావేళ ఆ ఇల్లాలిపైన చెయ్యికూడా చేసుకున్నాడు. ఆవిడ కోపంతోనూ దుఃఖంతోనూ వెళ్ళి పడుకుంది. వండి సిద్ధంగా ఉన్నది మాటాడకుండా వడ్డించుకుతిని ఆయన ఆఫీసుకీ, పెద్దకొడుకు కాలేజీకి తక్కిన

ముగ్గురూ బళ్లోకి చక్కాపోయారు. ప్రకాశిగాడికికూడా ఇంత పప్పూ అన్నం కలిపి కంచంలో వేసిపోయారుగాని, అది అలాగే ఉండిపోయింది. పుచ్చ కాయలా ఎప్పుడూ కబుర్లు చెప్పుతూ అమ్మ వెంట తిరగటం వాడికి అల వాటు. ఆమె వెళ్లి పడుకోడంతో వాడికాళ్లకి నోటికీ బంధాలుపడి వాడి కేం తోచిందికాదు. బిక్క మొహం వేసుకుని చాలాసేపు ఒకమూల కూచు న్నాడు. ఇంక ఉండబట్టలేక మెల్లిగా తల్లి మంచందగ్గిరకి వెళ్ళాడు. అప్పటి కావిడకి నిద్రపట్టినట్టుంది. కళ్ళుమూసింది. వాడు ఆమె పక్కలో పడుకునేసరికి మెలకువ వచ్చింది.

"బువ్వ తిన్నావుట్రా ?"

"లేదు"

"ఏం ?"

"నాన్న మంచివాలుకాదే. నిన్ను కొత్తాలు"

"బువ్వ తిను కళ్ళు"

"వొద్దే. నిన్ను నాన్న కొత్తాలు" అని వాడు వెక్కివెక్కి యేడవటం మొదలెట్టాడు. ఆమె లేచి బుజ్జగించింది. కంచం దగ్గిరకి తీసు కెళ్లి ముద్ద నోటికందిచ్చింది. వాడు నోరు తెరవలేదు. 'తినవేంరా' అంటే 'నువ్వుకూలా తినవే అమ్మా!' అన్నాడు. ఆమె కళ్లమ్మట నీళ్లు బొటబొట రాలాయి. ఐదేళ్లు నిండాయో లేదో ఆ రొంతవాడికి తనంటే ఎంతప్రేమో అనిపించిం దామెకు వచ్చి స్వర్గానవున్న తల్లి జ్ఞాపకంవచ్చి, 'మా అమ్మే వీడి నోట ఈమాట అనిపించింది!' అనుకుందామె.

మరుసటి సంవత్సరం రఘుపతి. పెద్దకొడుకు కామేశ్వరరావుకి 'మంచి' సంబంధం వచ్చిందని సంబరపడి పెళ్లి చేసేశాడు. రఘుపతికి పిల్లలు తప్ప వేరే ఆస్తి ఏమీలేదు. కామేశ్వరరావు చదువుచూసే అవతలవాళ్లు కట్నంకూడా ఇచ్చిచేశారు. కట్నంలోంచి సగంతీసి కోడలికి నగలు చేయిం చాడు రఘుపతి. మిగతా సహం, సదస్యానికనీ, పల్లకీ భజంత్రీలకనీ, గృహప్రవేశానికనీ ఖర్చైపోయింది. అప్పు చెయ్యనక్కర్లేకుండా చక్కని చుక్కలాంటి కోడలు చక్కావచ్చిందని సంబర పడ్డారు దంపతులిద్దరూను.

కాని కోడలువచ్చిన కొద్దికాలంలోనే రసరసలు బయటేరాయి. కామేశ్వరరావుకి ఊళ్లోనే ఉద్యోగమైంది. అతడు తెచ్చిన జీతం ఇంటో

ఇచ్చెయ్యటం ఆ పిల్లకి అంతగా నచ్చలేదు. పెద్దకొడుకు అందివస్తే తర్వాత వాళ్ల బతిజీతాలకు ఇబ్బంది పడనక్కర్లేదనుకున్నాడు రఘుపతి. రెండువేల కట్నం ఏ గంగలో కలిసినా ఆ లోటు తీరుతుంది అనుకున్నాడు; క్రమంగా కామేశ్వర్రావుకూడా వాళ్లపక్షమే అనిపించింది రఘుపతికి. ఒకనాడు ఆయన తొందరపడి, మాటలన్నాడు కొడుకుని. సరిగ్గా ఆయన పోలికేగా ఆ కొడుకులూను. ఆయన ముక్కోపం, ఆ ముక్కోపం వాళ్లకీవుంది. 'ఇప్పుడే పోతా నీ కొంపలోంచి!' అంటూ కామేశ్వర్రావు, పెళ్ళానీ ఆవిడ సారె సామాన్నీ ట్రంకుపెట్టెనీ బండిలో కెక్కించి వేరు వెళ్ళాడు.

రెండో కొడుకు మధుసూదనం కామేశ్వర్రావు కంటే ఎక్కువ తెలివిగా ప్రవర్తించాడు. 'నేను కట్నం పుచ్చుకోను' అన్నాడు. కాని తాను పుచ్చుకోదలచినదంతా పిల్లపేర భూమి రూపంలో రాయించుకున్నాడు. ఊళ్లో ఏదో నౌకరీవస్తే అది మంచిది కాదని చెప్పి బయట ఊరికిపోయాడు. రభస లేకుండా వేరు కాపరం పెట్టుకోగలిగి నాలుగురాళ్లు వెనకెయ్యగలిగేడు. రఘుపతి రెండుమూడుసార్లు తమ్ముళ్ల జీతాలమాట ఎత్తుతూ జాబులో రాశాడు. కాని మధుసూదనం, 'ఈవూళ్లో అన్నీ ప్రియం. నాకు వంట్లో ఆరోగ్యంగా లేదు. మందులకే బోలెడు అప్పుచేసుకోవలసి వచ్చింది' అన్న ధోరణిలో జవాబులు రాసి, 'ఇది వట్టిగొడ్డు. లాభంలేదు' అనే అభిప్రాయానికి తండ్రిని తీసుకొచ్చాడు.

మధుసూదనం పెళ్లికి రఘుపతి అప్పుచెయ్యాలసొచ్చింది. ఆ అప్పు ఎప్పటికీ తీరక ఆయన చిక్కుపడ్డాడు. మూడోకొడుకు నరసింహామూర్తి పెళ్లికి ఆయన జాగ్రత్త పడ్డాడు. "మాకు కట్నం వద్దు, కానుకలూ వద్దు. ఉభయఖర్చులూ మీరే పెట్టుకొని, పెళ్లి చెయ్యండి. మీ పిల్లకి మీ యిష్టం వచ్చిన నగలు మీరే పెట్టుకోండి" అన్నాడు. అలాగే జరిగింది వివాహం. పెళ్లైన యేడే నరసింహామూర్తి ఇంటరు ప్యాసయ్యాడు. "నేను నీకు బి. ఏ. దాకా చెప్పించలేను" అని కాళ్లు చాచాడు రఘుపతి. వియ్యాలవారికి కా సంగతి తెలిసి "అర్ధాంతరంగా మానిపించేస్తే ఎలాగ?" అని వాళ్లే, అల్లుణ్ణి బి. ఏ. చదివించటానికి పూనుకున్నారు. అది పూర్తిఅయాక అతగాడికి

ఉద్యోగంకూడా వాళ్ళే చూసి పెట్టేరు. డబ్బుకోసమని నరసింహమూర్తికి జాబురాయాలని రఘుపతికి అప్పుడప్పుడు అనిపించేది గాని, 'ఏ మొహం పెట్టి అడగటం?' అని, కొసకి కలం జేబులో పెట్టేసేవాడు.

వీరభద్రం ఫిఫ్తుఫారం, ప్రకాశ్రావు థర్డుఫారం చదువుతుండగా రఘుపతి అవతారం చాలించాడు. అప్పు ఆసుల అంతులు చూసుకుంటే, మధుసూదనం పెళ్లి బాపతు ఋణశేషం ఇంటి తనఖామీద ఇంకా మూడు వందలుదాకా ఉన్నదనీ, భీమాబాపతు సొమ్ము వెయ్యిరూపాయల పైచిల్లర రాబోతోందనీ తేలింది. అవి ఎలా పంచుకోడమని పైకిపోయిన ముగ్గురు కొడుకులూ ఆలోచిస్తోంటే, గమనించిన అన్నపూర్ణ నివ్వెరపోయింది. ఆవిడ దుఃఖం దిగమింగుకుని, "నామాట అటుంచి, ఇంకా మీకు ఇద్దరు తమ్ముళ్లూ, వాళ్ళ చదువులూ, కార్యాలూ కథలూ ఉన్నాయన్న మాట మరిచిపోకండి" అంది. వాళ్ళు ఏమనుకున్నారో, మరి మాటాడక చక్కాపోయారు. భీమా సొమ్ములోంచి ఆమె ఋణశేషం తీర్చివేసింది. ఆయేడు ప్రకాశం థర్డుఫారం తప్పిపోయాడు. వాడు అన్నలంత తెలివైనవాడుకాదు చదువులో. ప్యాసుకి అభ్యంతరం లేకుండా శ్రమపడి మార్కులు గట్టించుకునేవాడు కాని ఆయేడు ముమ్మరకవచ్చిన కష్టం వాడిమనస్సు కలిచివేసింది. పుస్తకం పట్టలేకపోయేవాడు. పట్టినా బుర్రలోకి ఏమీ ఎక్కేదికాదు.

మళ్ళీయేడు వాడు థర్డుఫారం, వీరభద్రుడు స్కూలుఫైనలూ ప్యాసయారు. దానితో భీమాసొమ్ము చెల్లు అయింది. అన్నపూర్ణమ్మ, "ముందు మాటేమిటి?" అని నౌకరీలలోఉన్న కొడుకులు ముగ్గురికీ కార్డులు రాయించింది. "ఎవళ్ళ సంసారాలు వాళ్ళకే ఉన్నా"యన్నారు ఆ పసిడివన్నెల ముసిణిపళ్లు ముగ్గురూను. ఆవిడ ఒక్కగది కేటాయించుకొని ఇల్లంతా అద్దెకిచ్చింది. ఆ అద్దెతో భోజనమే గడవనప్పుడు చదువు లెలాసాగుతాయి?

ఐతేం, మనదేశంలో పెళ్లిళ్లు మాత్రం అడ్డవుకదా. భద్రానికూడా సంబంధం వచ్చింది. ఆయనెవరో మిల్లు గుమాస్తాట. ఒకర్తే కూతురుట. భద్రాన్ని ఇల్లరికానికి తీసుకుపోయి, మిల్లు లెక్కలలో తరిఫీ దిచ్చాడు. ఈవిధంగా ఆ నాలుగు బంగారువన్నె పిచికలూ నలుదిక్కులకూ ఎగిరిపోయి, ఆ ఇంట అన్నపూర్ణా, ఆ నల్లనేరేడుపండూ మిగిలారు.

ఒకనాడు పక్కింటావిడ వచ్చికూచుని, అన్నపూర్ణతో, "ఇంక మీ ప్రకాశానికికూడా పెళ్లిఅయితే, నీ కష్టాలన్నీ గట్టెక్కినట్లే" అంది.

ఆమె వెళ్ళాక ప్రకాశం తల్లితో, "అమ్మా, నాకుమాత్రం పెళ్లి చెయ్యకు సుమా" అన్నాడు.

"ఏమిరా?" అంది ఆమె నివ్వెరపోతూ.

"వదినలొచ్చి అన్నయ్యల్ని వేరుచేసేశారు. అన్నయ్యలొచ్చి నిన్ను పలకరించటమైనా లేదు" అన్నాడు వాడు.

"మన బంగారం మంచిదైతే కంసాలి నసటం దేనికిరా బాబూ? ఇంతకీ నీ పెళ్ళాం నన్ను సరిగ్గానే చూస్తుందేమో" అన్నదామె.

"ఏమో, చూడకపోతే అప్పుడేమిటి చెయ్యటం? చేతులు కాలేక ఆకులు పట్టుకుని యేంలాభం?" అన్నాడు.

ఆ ఊళ్లోనే వీధిబడి పెట్టుకున్న శిష్టుకరణం ప్రకాశాన్ని అసిస్టెంటుగా వేసుకున్నాడు. నెలకి ముప్ఫైరూపాయిల జీతం.

"స్థిరపడ్డావు గనక ఇంక పెళ్లిచేసుకోరా" అంది అన్నపూర్ణ.

"ఏం స్థిరపడ్డం? ఇల్లు పంచుకుంటామని అన్నయ్యలు వస్తారింక. అప్పుడు మన ఇద్దరికీ ఈ ముప్ఫై రూపాయలే ఆధారం" అంటూ బళ్లోకి వెళ్లిపోయాడు ప్రకాశం.

ఆరోజున ఇంట్లో కాపరం ఉన్నవాళ్లంతా సినిమాకి పోయి, ఆమె ఒక్కతే కూచుండిపోయింది. పద్దెనిదేళ్ళక్రితం ఆమె ఆస్పత్రిలో పోసుకున్న పురిటిమాట జ్ఞాపకం వచ్చిందామెకు. ఆనాడు తను ఏమనుకుంది? 'ఆతల్లి ఎవరో పిల్లవాడు మారిపోయాడని తెలిసికూడా అందమైనవాడని మోజుపడి గప్‌చిప్‌గా ఊరుకుంది! నాకు అపచారం చేసింది!' అని, ఆ మాటలే ఇప్పుడు జ్ఞప్తికొచ్చి, 'ఆ ఇల్లాలికి నేనే అపచారం చేశాను! ప్రకాశం అందగాడు కాకపోయినా హృదయసౌందర్యం ఉన్నవాడు. తల్లిముప్పు తీర్చగలవాడు. ఇలాంటివాణ్ణి నేను దక్కించుకుని, నా ఎర్రతేలు నాకణ్ణి ఆమెకు అప్పగించాను! ఆమెకు ఇంక వేరే సంతానం లేదేమో...!

వాడా నేను ఏం తిప్పలు పెడుతున్నానో!' అని ఆవిడ హృదయంలో మరొక్క ఊహకూడా బయల్దేరింది. 'తక్కిన కొడుకులకు చెప్పించినంత చదువుకూడా చెప్పించలేకపోయాను వీడికి! ఆ తల్లి శ్రీమంతురాలైఉండి, వీడామెవద్దనే పెరిగిఉంటే, ఈ కాయకష్టం లేకపోను! తల్లికీ కొడుక్కీ నేనే అపచారం చేశాను...!' ఈ ఆవేదన అన్నపూర్ణని సదాకా బాధిస్తూనే ఉండిపోయింది.

కథాసాగరం

5

పన్యాల రంగనాథరావు

...... కథలు ......